## క్లుప్తంగా

### కలికిరి తహసీల్దారుగా విజయకుమారి

**కలికిరి :** కలికిరి తహసీల్దారుగా పి.విజయకుమారిని అధికారులు నియమించారు. అనంతపురం జిల్లా కుందుర్పి మండలం నుంచి ఇక్కడికి ఆమెను బదిలీ చేశారు. ఇక్కడ పని చేస్తున్న తహసీల్దారు భాగ్యలత అనంతపురం జిల్లాకు బదిలీపై వెళ్ళారు. బదిలీపై వెళ్లిన తహసీల్దారు భాగ్యలతకు శనివారం కార్యాలయ సిబ్బంది ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. కార్యక్రమంలో డీటీ సయ్యద్ అహ్మద్, వీఆర్‌ఓలు విశ్వనాథ, శ్రీనివాసులు, వి/హ్సాన్, కదిరప్ప, సుధాకర, నరేంద్రరెడ్డి, చంద్రయ్య, వెంకటేష్, నరేష్, తస్లీం, దొరస్వామి, సుల్తాన్‌బాషా, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

### వాల్మీకిపురం సీఐగా పులి శేఖర్



**వాల్మీకిపురం :** వాల్మీకిపురం సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా పులి శేఖర్ శనివారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పని చేస్తున్న సీఐ సురేష్ కుమార్ కర్నూలు వీఆర్‌కు బదిలీ అయ్యారు. నంద్యాల వీఆర్‌లో ఉన్న పులిశేఖర్ బదిలీపై వాల్మీకిపురంకు వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్కిల్ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తానన్నారు. అలాగే నాటుసారా తయారీ, విక్రయాలు, మద్యం అక్రమ రవాణా, జూదం వంటి వాటిపై గట్టి నిఘాపెట్టి ఎంతటివారినైనా ఉపేక్షించక పూర్తి స్థాయిలో అరికట్టే దిశగా చర్యలు తీసుకుంటామన్నారు. రాత్రి గస్తీలను ముమ్మరం చేస్తామన్నారు.

### కలికిరి సీఐగా మోహన్



**కలికిరి :** కొత్తగా అప్‌గ్రేడ్ అయిన కలికిరి పోలీస్ స్టేషన్ మొదటి సీఐగా ఆర్.మోహన్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేస్తున్న వాల్మీకిపురం సీఐ పి.సురేష్ కుమార్ బదిలీ కావడంతో అనంతపురం జిల్లా నుంచి ఈయన బదిలీపై వచ్చారు. మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు తన వంతు కృషి చేస్తానని నూతన సీఐ పేర్కొన్నారు.

### ఆడుదాం ఆంధ్ర జిల్లా పోటీల్లో వగళ్ల కేజీబీవీ ప్రతిభ



జిల్లా స్థాయి పోటీలో రాణించిన విద్యార్థినులతో ప్రిన్సిపాల్ శ్రావణి

**కేవీపల్లె :** ఆడుదాం ఆంధ్ర జిల్లా స్థాయి పోటీల్లో మండలంలోని వగళ్ల కస్తూర్బాగాంధీ బాలికల గురుకుల విద్యాలయం ప్రతిభ చూపినట్లు ప్రిన్సిపాల్ శ్రావణి తెలిపారు. శనివారం జిల్లా స్థాయిలో రాణించిన విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లా ఖోఖో పోటీల్లో తమ పాఠశాల విద్యార్థినులు ద్వితీయ స్థానం సాధించినట్లు తెలిపారు. కార్యక్రమంలో పీఈటీ స్వాతి, ఉపాధ్యాయినులు పాల్గొన్నారు.

### రక్తదానం




రక్తదానం చేస్తున్న యువత

**వాల్మీకిపురం :** 35వ జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాల్లో భాగంగా మండలంలోని గండబోయనపల్లిలో రక్తదాన శిబిరం నిర్వహించినట్లు జీఆర్ ఇన్ఫ్రా ప్రాజెక్టు ప్రైవేట్ లిమిటెడ్ డైరెక్టర్ వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల బారిన పడకుండా ఉండాలంటే డ్రైవర్లు, ప్రజలు రోడ్డు ప్రమాదాలపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. అనంతరం 30 మంది రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో నాగేంద్ర బాబు, ఇందిరా ప్రియదర్శిని, రవికుమార్, అమరావతి, సునీత, ధనుంజయ, ఉమా శంకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### చెక్ పోస్టుల వద్ద నిఘా పెంచాలి

– జిల్లా ఏఎస్పీ రాజ్ కమల్



రామసముద్రం చెక్‌పోస్ట్‌లో రికార్డులు తనిఖీ చేస్తున్న ఏఎస్పీ రాజ్‌కమల్

**రామసముద్రం :** కర్ణాటక సరిహద్దు చెక్‌పోస్టుల వద్ద నిఘా పెంచాలని జిల్లా అడిషినల్ ఎస్పీ రాజ్ కమల్ సూచించారు. శనివారం సాయంత్రం ఆయన రామసముద్రం మండలంలోని కర్ణాటక సరిహద్దుల్లో ఉన్న చెక్‌పోస్టులలో ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎన్నికలు సమీపిస్తున్న నేపధ్యంలో కర్ణాటక నుంచి అక్రమంగా మద్యం, నగదు రాకుండా జాగ్రత్త వహించాలన్నారు. అదనపు సిబ్బందిని నియమించి చెక్ పోస్టులలో తనిఖీ చేపట్టాలన్నారు. అనంతరం స్టేషన్‌లలో రికార్డులు పరిశీలించి త్వరితగతిన కేసులను పెండింగ్ లేకుండా పరిష్కరించాలన్నారు. ఆయన వెంట ఎస్ఐ చంద్రశేఖర్, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

# అందుబాటులో ఉంటా...ఆదరించండి

**వైఎస్సార్ సీపీ సమన్వయకర్త నిస్సార్ అహమ్మద్**



రామసముద్రంలో ర్యాలీ చేస్తున్న నిస్సార్ అహమ్మద్, తిప్పారెడ్డి తదితరులు

**రామసముద్రం :** ప్రజల కష్ట సుఖాలు తెలిసిన వ్యక్తిని...అర్ధరాత్రి ఫోన్ చేస్తే పలుకుతాను.ఈ సారి మదనపల్లె వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఎంపిక చేశారని నియోజకవర్గ సమన్వయకర్త నిస్సార్ అహమ్మద్ తెలిపారు. శనివారం తొలిగారిగా ఆయన మాజీ ఎమ్మెల్యే డాక్టర్ దేశాయి తిప్పారెడ్డి, మాజీ ఎమ్మెల్సీ నరేష్‌కుమార్‌రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ షమీమ్ అస్లాం, మున్సిపల్ వైస్ చైర్మన్ జింకా వెంకటాచలపతిలతో కలసి మండలంలో పర్యటించారు. వారికి స్థానిక నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. చెంబకూరు మూడు రోడ్ల కూడలి నుంచి రామసముద్రం వరకు భారీగా బైక్ ర్యాలీ నిర్వహించారు. రామసముద్రంలో వాల్మీకి, అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలలు వేశారు. అక్కడ నుంచి కర్ణాటక రాష్ట్రంలోని కురుడుమలైలో వెలసిన పురాతన శ్రీవినాయక ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు తీసుకున్నారు. ఆలయ అర్చకులు నిస్సార్ అహమ్మద్‌ను గౌరవప్రదంగా సన్మానించి ఆశీర్వదించారు. అనంతరం కురిజల పంచాయతీ బరిడేపల్లిలో ప్రచార కార్యక్రమం చేపట్టారు. మహిళలు మంగళహారతులతో స్వాగతం పలికారు. ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో ఎంపీపీ కుసుమకుమారి, జెడ్పీటీసీ రామచంద్రారెడ్డి, సింగిల్‌విండో అధ్యక్షుడు కేశవరెడ్డి, వైస్ ఎంపీపీలు రమణారెడ్డి, గంగాధర్‌నాయుడు, కన్వీనర్ నంద, భాస్కర్‌గౌడు, జయరామిరెడ్డి, సుబ్రమణ్యం, మతవల్లి సిరాజ్‌బాషా, మహబూబ్‌బాషా, దొడ్డిపల్లి ఆనంద, చంద్రశేఖర్‌రావు, రాధారెడ్డి, తిమ్మారెడ్డి, బీసి నాయకులు గెవన్న, హైదర్‌వల్లి, రెడ్డెప్పనాయుడు, చరణ్, సురేంద్ర, ఆనందరెడ్డి, మస్తాన్‌రెడ్డి, కోటూరిఈశ్వర్, జింకల శ్రీనివాసులు, బాలాజి, వేణుగోపాల్‌రెడ్డి, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రారంభ దశలో గుర్తిస్తే కిడ్నీ సమస్యలు దూరం

**యూరాలజిస్ట్ డాక్టర్ సనత్‌రెడ్డి**



ఆపరేషన్ చేయించుకున్న వ్యక్తితో డాక్టర్ సనత్‌రెడ్డి

**మదనపల్లె :** టీబీ అంటే ఊపిరితిత్తులకు వచ్చే వ్యాధి అని అందరికీ తెలుసని, అయితే కిడ్నీకి టీబీ సోకే అవకాశం ఉంది. ప్రారంభంలోనే దీన్ని గుర్తిస్తే కిడ్నీ పాడవకుండా జాగ్రత్తలు తీసుకోవచ్చని యూరాలజిస్ట్ డాక్టర్ సనత్‌రెడ్డి అన్నారు. శనివారం స్థానిక ఆద్య కిడ్నీ కేర్ ఆస్పత్రిలో కిడ్నీకి టీబీ సోకిన పేషంట్‌కు సర్జరీ విజయవంతమైంది. ఈ సందర్భంగా మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. డాక్టర్.సనత్ రెడ్డి, అనస్థీషియా డాక్టర్.పావని మాట్లాడుతూ...పట్టణానికి చెందిన 50 సంవత్సరాల వయస్సు కలిగిన ఓ వ్యక్తి కడుపునొప్పి, జ్వరంతో చాలా కాలంగా ఇబ్బంది పడుతూ చికిత్స కోసం వచ్చాడన్నారు. అతడికి పరీక్షలు చేశాక, కిడ్నీకి టీబీ ఇన్‌ఫెక్షన్ సోకడంతో ఇబ్బంది ఎదుర్కొంటున్నట్లు గుర్తించామన్నారు. సాధారణంగా ఇలాంటి వాటికి బెంగళూరు, హైదరాబాద్, చెన్నైలో కార్పొరేట్ ఆస్పత్రుల్లోనే చికిత్సలు అందించడం జరుగుతుందన్నారు. పేషంట్ పరిస్థితి దృష్ట్యా వెళ్లేందుకు వీలు లేకపోవడంతో ఆద్య ఆస్పత్రిలోనే అవసరమైన అన్ని జాగ్రత్తలు తీసుకుని, సుమారు 2 గంటలపాటు శ్రమించి, ఆపరేషన్ విజయవంతంగా పూర్తి చేశామన్నారు. పేషంట్ ప్రస్తుతం కోలుకుని ఆరోగ్యంగా ఉన్నాడన్నారు. కిడ్నీ సంబంధిత సమస్యలు ఉన్న వ్యక్తులు వ్యాధి ప్రారంభదశలో ఆస్పత్రికి వస్తే, పరీక్షలు చేసి, ముందస్తు వైద్యంతో కిడ్నీ పాడవకుండా కాపాడుకోవచ్చన్నారు.

### అనాథకు ఆసరాగా వైఎస్సార్ పెన్షన్ కానుక



పెన్షన్ కానుక అందజేస్తున్న వెల్ఫేర్ అసిస్టెంట్ మధు

**పెద్దతిప్పసముద్రం :** మండలంలోని కందుకూరు సచివాలయ పరిధిలో ఉంటున్న జైబూన్‌కు కుటుంబ సభ్యులు ఎవరూ లేక అనాథగా మిగిలింది. దీంతో ప్రతి నెలా వైఎస్సార్ పెన్షన్ కానుక సొమ్ముతో ఈ వృద్ధురాలు జీవనం సాగించేది. వయసు మీద పడటం, శరీరం కూడా సహకరించక పోవడంతో ఈమె ఎక్కడకు వెళ్లాలని అనుకుందో ఏమో.. ఎవరు తీసుకెళ్లారో కాని సత్యసాయి జిల్లా హిందూపురం సమీపంలోని మిట్టపల్లిలో ఓ టెంట్‌లో తలదాచుకుంటూ అచేతన స్థితిలో ఉంది. కందుకూరు సచివాలయంలో వెల్ఫేర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న మధు సదరు మహిళ గురించి సమగ్రంగా తెలుసుకుని బుధవారం 150 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఆమె వద్దకు వెళ్లి పింఛన్ అందజేశాడు.

### తిరుపతికి వెళ్లి పింఛన్ అందజేత



పింఛన్ అందజేస్తున్న గ్రామ వలంటీర్ షేక్‌షారు

**పీలేరు రూరల్ :** అనారోగ్యంతో బాధపడుతూ తిరుపతిలోని స్విమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఓ మహిళకు పింఛన్ పంపిణీ చేసిన గ్రామ వలంటీర్ శభాష్ అనిపించుకున్నాడు. పీలేరుకు చెందిన షేక్ బీబీ కిడ్నీ వ్యాధితో బాధపడుతూ తిరుపతిలో చికిత్స పొందుతోంది. గ్రామ వలంటీర్ షేక్ షారు శనివారం తిరుపతికి వెళ్లి రూ. 10 వేలు పింఛన్ అందించాడు. లబ్ధిదారురాలు సంతోషం వ్యక్తం చేస్తూ సీఎం వైఎస్ జగన్‌ను నిండు మనస్సుతో ఆశీర్వదించింది.

## షమీమ్‌అస్లామ్‌కు క్రైస్తవ పాస్టర్ల సన్మానం



షమీంఅస్లాంను సన్మానిస్తున్న క్రైస్తవ పాస్టర్లు

**మదనపల్లె :** ఏపీఎండీసీ చైర్‌పర్సన్‌గా రెండోసారి అవకాశం దక్కించుకున్న వైఎస్సార్ సీపీ మహిళానాయకురాలు షమీమ్‌అస్లామ్‌ను శనివారం క్రైస్తవ విభాగం జిల్లా అధ్యక్షులు బోనాసిజాన్‌బాబు ఆధ్వర్యంలో క్రైస్తవ పాస్టర్లు ఘనంగా సన్మానించారు. స్థానిక ఎస్‌వీఆర్ లేఅవుట్‌లోని ఆమె స్వగృహానికి వెళ్లి దుశ్శాలువ, పుష్పగుచ్ఛంతో అభినందనలు తెలిపారు. మైనారిటీ వర్గానికి చెందిన మహిళ ఉన్నత పదవులను అలంకరించడం తమకెంతో సంతోషంగా ఉందని, భవిష్యత్తులో ప్రజల ఆదరాభిమానాలతో మరింత ఉన్నత స్థానాలకు ఎదగాలని ఆశీర్వదించారు. ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఫిబ్రవరి 3వ వారంలో మదనపల్లె సీఎస్ఐ కమ్యూనిటీ హాల్‌లో నిర్వహించనున్న క్రైస్తవ మైనారిటీ హక్కుల అవగాహన సదస్సు నిర్వహిస్తున్నామని, సమావేశానికి హాజరవ్వాల్సిందిగా ఆహ్వానం అందించారు. క్రైస్తవులకు శ్మశాన వాటిక స్థలం ఏర్పాటుకు సహకరించాల్సిందిగా కోరారు. కార్యక్రమంలో పాస్టర్లు జలదప్రసాదరావు, బోయాజ్, జీవరత్నం, శ్యామూల్, దేవమణి, బాబు యోహాన్, అలీసమ్మ, రేచల్, పద్మ, క్రైస్తవ అనుబంధ విభాగ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## బహుజనులకు రాజ్యాధికారం రావాలి

**బీఎస్పీ ఎంపీ రామ్‌జీ గౌతమ్**



బీఎస్పీ ప్రచార పోస్టర్‌లను ఆవిష్కరిస్తున్న ఎంపీ రామ్‌జీగౌతమ్ తదితరులు

**మదనపల్లె :** అణగారిన వర్గాల ప్రజలు బాగుపడాలంటే...బహుజనులకు రాజ్యాధికారం రావాలని బహుజన్ సమాజ్ పార్టీ ఎంపీ రామ్‌జీ గౌతమ్ అన్నారు. శనివారం మదనపల్లెలో బీఎస్పీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బండెల గౌతమ్‌కుమార్ ఆధ్వర్యంలో జరిగిన బహుజన రాజ్యాధికార సదస్సుకు ఎంపీ రామ్‌జీ గౌతమ్, బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షులు బి.పరంజ్యోతి, సెంట్రల్ కోఆర్డినేటర్ బాలయ్య, రిటైర్డ్ జడ్జి గుర్రప్ప ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పట్టణంలో బీఎస్పీ శ్రేణులు నిర్వహించిన ర్యాలీలో జిల్లా వ్యాప్తంగా బీఎస్పీ కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు. ముందుగా అంబేడ్కర్, పూలే, కాన్షీరామ్ చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఏర్పాటుచేసిన సమావేశంలో బీఎస్పీ ఎంపీ రామ్‌జీ గౌతమ్ మాట్లాడుతూ...భవిష్యత్తు బహుజనులదేనని, బడుగు, బలహీనవర్గాల ప్రజలు బహుజన సమాజ్ పార్టీని ఆదరించాలన్నారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం నియంతృత్వపాలన సాగిస్తూ, అణగారిన వర్గాల హక్కులను కాలరాస్తోందన్నారు. మతతత్వపార్టీలను గద్దె దించి, బహుజనులకు రాజ్యాధికారం దిశగా కృషిచేస్తేనే న్యాయం జరుగుతుందన్నారు. బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షులు బి.పరంజ్యోతి మాట్లాడుతూ..రాష్ట్రంలో కేవలం రెండుకులాలు, నాలుగు పార్టీలు మాత్రమే ప్రభుత్వాలు నడుపుతున్నాయని, వీటికి రానున్న ఎన్నికల్లో చెక్ పెట్టాలన్నారు. బహుజన కులాలు ప్రభుత్వాలు అందించే సంక్షేమ పథకాలకు ఎదురుచూడటం మానుకుని, తమ జీవితాల్లో వెలుగులు తెచ్చే దిశగా యోచన చేయాలన్నారు. కార్యక్రమంలో సోషియల్ వెల్ఫేర్ రిటైర్డ్ జేడీ విజయ్‌కుమార్, ఆర్.జే.మల్లికల్, బీఎస్పీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

## వృత్తి విద్యలో మెలకువలు నేర్చుకోవాలి



దుస్తుల పరిశ్రమలో టైలరింగ్ యూనిట్‌ను పరిశీలిస్తున్న విద్యార్థులు

**మదనపల్లె సిటీ :** వృత్తి విద్యలో విద్యార్థినుల్లో మెలకువలు తెలుసుకునేందుకు పరిశ్రమల సందర్శన నిర్వహిస్తున్నట్లు డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ గురుకులం ప్రిన్సిపాల్ వసుంధరదేవి అన్నారు. శనివారం మదనపల్లె ఇండస్ట్రీయల్ ఎస్టేట్‌లో పాఠశాల విద్యార్థులు బీ అప్పియరల్ పరిశ్రమను సందర్శించారు. ఆమె మాట్లాడుతూ సర్వశిక్ష అభియాన్ సౌజన్యంతో గార్మెంట్ ఇండస్ట్రీస్ ప్రాసెస్ ద్వారా విద్యార్థులను వృత్తి విద్యలో ప్రోత్సహించడంలో భాగంగా టైలరింగ్, స్టిచింగ్ తదితరాల అంశాలపై అవగాహన కల్పించడం జరిగిందన్నారు. ప్రస్తుతం ఒకేషనల్ కోర్సులకు మంచి డిమాండ్ ఉందన్నారు. కార్యక్రమంలో ఒకేషనల్ ఉపాధ్యాయురాలు మాళవిక స్వాతి, ఉపాధ్యాయులు మునిసుధారాణి, రూప తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి పోటీలకు మదనపల్లె విద్యార్థులు

**మదనపల్లె :** ఆడుదాం ఆంధ్రా జిల్లాస్థాయిలో రాయచోటిలో నిర్వహించిన పోటీల్లో క్రికెట్, కబడ్డీ బాలికల విభాగంలో మదనపల్లె విద్యార్థులు ప్రథమ స్థానాల్లో నిలిచి, రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. శుక్రవారం రాయచోటిలో నిర్వహించిన బాలికల విభాగం క్రికెట్ పోటీల్లో రైల్వేకోడూరు జట్టుపై పదివికెట్ల తేడాతో మదనపల్లె జట్టు గెలుపొందింది. అలాగే కబడ్డీలో ఐదుపాయింట్ల తేడాతో మదనపల్లె జట్టు గెలుపొంది, ప్రథమస్థానంలో కప్పులు అందుకుంది. పట్టణంలోని రామారావుకాలనీ, ఎస్‌బీఐ కాలనీ సచివాలయాల జట్టు తరపున స్థానిక జ్ఞానాంబిక డిగ్రీ కళాశాల విద్యార్థులు పోటీల్లో పాల్గొని ప్రతిభ కనపరిచారు. ఈ సందర్భంగా క్రీడాకారులను కరస్పాండెంట్ డాక్టర్.ఆర్.గురుప్రసాద్, ప్రిన్సిపాల్ రమాదేవి, పీడీ శరత్‌నాయక్, జగదీష్ అభినందించారు.



జిల్లాస్థాయిలో ప్రతిభ కనపరిచి, రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు

## ఆర్టీసీ సిబ్బందికి ఆరోగ్య పరీక్షలు

**జిల్లా ప్రజా రవాణాధికారి రాము**



మాట్లాడుతున్న జిల్లా ప్రజారవాణాధికారి రాము

**మదనపల్లె సిటీ :** ఆర్టీసీకి సిబ్బందికి తరచూ ఆరోగ్య పరీక్షలు నిర్వహించనున్నట్లు జిల్లా ప్రజా రవాణాధికారి రాము అన్నారు. రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా శనివారం టు డిపో కార్యాలయంలో దృష్టి కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో సిబ్బందికి ఉచితం కంటి పరీక్షలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ డ్రైవర్లు రోడ్డు, నియమ నిబంధనలు తప్పకుండా పాటించాలన్నారు. జీరో యాక్సిడెంట్ డిపోలుగా మార్చాలన్నారు. ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం సురక్షితమన్నారు. ఆ నమ్మకాన్ని కాపాడాలని, యాక్సిడెంట్లు జరగకుండా చూడాలని సూచించారు. మద్యం తాగడం, సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ డ్రైవింగ్ చేయడం చేయకూడదన్నారు. కార్యక్రమంలో వన్,టు డిపో మేనేజర్లు మూరే వెంకటరమణారెడ్డి, ఆర్‌సీ నిరంజన్, సైకాలజిస్టు సుధాకర్‌రెడ్డి, సీఐలు రేవతి, గీత తదితరులు పాల్గొన్నారు. అలాగే వన్ డిపో కార్యాలయంలో ఆర్టీవో శివలింగయ్య రోడ్డు భద్రతా వారోత్సవాల్లో పాల్గొని డ్రైవర్లకు సలహాలు, సూచనలు ఇచ్చారు.

## భాగ్యవతి మృతిపై జనవిజ్ఞానవేదిక సంతాపం



భాగ్యవతి భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తున్న జనవిజ్ఞానవేదిక నాయకులు

**మదనపల్లె :** ఎస్కేయూ విశ్రాంత ప్రొఫెసర్ భాగ్యవతి మృతిపై జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్ సంతాపం తెలిపారు. శనివారం అనారోగ్యంతో మరణించిన డాక్టర్ భాగ్యవతి భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మదనపల్లెలోని విశ్రాంత ప్రొఫెసర్ వెంకటరెడ్డి సతీమణి భాగ్యవతి సామాజిక కార్యకర్తగా, అక్షరాస్యత ఉద్యమనేతగా, ప్రజాసైన్స్ ఉద్యమనేతగా నిండుజీవితం గడిపారన్నారు. మదనపల్లె మండలంలో అనేక సామాజిక సంస్కరణ కార్యక్రమాలు నిర్వహించారు. పాఠశాల విద్యార్థుల్లో శాస్త్రీయ భావాల ప్రచారం కోసం తమ సమయాన్ని వెచ్చించేవారన్నారు. కుల మతాల తారతమ్యాలు వద్దని, సమానత్వం కోసం కృషిచేశారన్నారు. తమ బిడ్డలకు కులాంతర, మతాంతర వివాహాలను చేసి ఆదర్శంగా నిలిచారన్నారు. ప్రముఖ హేతువాది బాబుగోగినేని వీరికి అల్లుడని, 2004లో అనంతపురం జిల్లా జనవిజ్ఞానవేదిక అధ్యక్షులుగా భాగ్యవతి పనిచేశారన్నారు. ఆమె భౌతికకాయాన్ని సందర్శించిన వారిలో.. ప్రొఫెసర్ సుబ్బరంగయ్య, మాలకొండయ్య, ఓబులరెడ్డి, నాగభూషణం రాజు, డాక్టర్ ప్రసూన, శాంత, ప్రొఫెసర్.శివరామిరెడ్డి, ప్రకృతివనం ప్రసాద్, సీపీఎం జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు తదితరులు ఉన్నారు.

## నాణ్యత ప్రమాణాలపై అవగాహన



బహుమతి అందుకుంటున్న జ్యోతిరాధిత్య రాయ

**వాల్మీకిపురం :** విద్యార్థి దశ నుంచే నాణ్యత ప్రమాణాలపై అవగాహన కలిగి ఉండాలని స్థానిక పీవీసి ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం సావిత్రి అన్నారు. బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ విజయవాడ ఆధ్వర్యంలో శనివారం స్థానిక పాఠశాలలో స్టాండర్డ్స్ క్లబ్‌ను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు కొనుగోలు చేసే ప్రతి వస్తువు, ఆహార పదార్థాలు తదితర వాటిని ఎలా ఎంపిక చేయాలని అనే వాటిపై వ్యాసరచన పోటీలను నిర్వహించారు. అనంతరం ప్రథమ బహుమతి జ్యోతిరాధిత్య రాయ, రెండవ బహుమతి వరుణ్ సందేశ్, తృతీయ బహుమతి రాజులకు బహుమతి, ప్రసంశాపత్రాలను అందించారు ఉపాధ్యాయులు రవీంద్ర రెడ్డి, రమణప్ప, వసుమతి, కల్పలత, నాగరాజ పాల్గొన్నారు.

## సేవలతోనే ఉద్యోగులకు గుర్తింపు



ఎంపీడీఓ సురేంద్రనాథ్‌ను సన్మానిస్తున్న అధికారులు

**తంబళ్లపల్లె :** ప్రభుత్వ ఉద్యోగులు ప్రజలకు అందించే సేవలతోనే మంచి గుర్తింపు లభిస్తుందని మండల అభివృద్ధి కమిటీ చైర్మన్ నారాయణరెడ్డి తెలిపారు. స్థానిక ఎంపీడీఓ సురేంద్రనాథ్ బదిలీపై రాయచోటికి వెళ్తున్న సందర్భంగా ఎంపీడీవో కార్యాలయంలో శనివారం సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, కార్యాలయ సిబ్బంది ఆయనను శాలువతో సత్కరించారు. కార్యక్రమంలో కార్యాలయ ఏవో సురేంద్రనాథ్, ఏపీవో అంజనప్ప, ఎంఈవో త్యాగరాజు, సర్పంచుల సంఘం అధ్యక్షులు సుధాకర్‌రెడ్డి, ఆర్‌బీకే చైర్మన్ రెడ్డిమల్‌రెడ్డి, నాయకులు శ్రీనివాసులు, కోటిరెడ్డి, శివారెడ్డి, మైనుద్దీన్‌లు పాల్గొన్నారు.

# ఎన్నికల యుద్ధానికి సిద్ధం కావాలి



హాజరైన నాయకులు, కార్యకర్తలు



పీలేరు సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే చింతల

**పీలేరు/కేవీపల్లె :** ఎన్నికల యుద్ధానికి వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు సిద్ధం కావాలని పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. శనివారం కేవీపల్లె మండలం వగళ్లలో, పీలేరులోని వీఎస్ఆర్ కల్యాణ మండపంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ నెల 11న అనంపురంలో నిర్వహించనున్న 'సిద్ధం' సభకు పీలేరు నియోజకవర్గం నుంచి పెద్ద ఎత్తున తరలి రావాలని పిలుపునిచ్చారు. త్వరలో ఎన్నికల నోటిఫికేషన్ వెలువడుతుందని పార్టీ నాయకులు, కార్యకర్తలు ఇప్పటి నుంచే సిద్ధంగా ఉండాలని సూచించారు. వైఎస్సార్ సీపీ అధికారం చేపట్టినప్పటి నుంచి రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి అన్ని విధాలుగా రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారని తెలిపారు. మన ప్రభుత్వంలో కులాలు, వర్గాలు, పార్టీలు చూడకుండా అన్ని వర్గాల అభివృద్ధే లక్ష్యంగా సంక్షేమ పథకాలు అమలు చేయడం జరిగిందని తెలిపారు. ప్రతి కుటుంబం ఆర్థికంగా లబ్ధిపొందినట్లు తెలిపారు. మనం చేసిన అభివృద్ధిని ప్రజలకు వివరించాల్సిన బాధ్యత కార్యకర్తలపై ఉందని చెప్పారు. పీలేరు నియోజకవర్గంలోనూ ఎంతో అభివృద్ధి చేశామని తెలిపారు. సీఎం తోపాటు రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మిధున్‌రెడ్డి సహకారంలో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని తెలిపారు. తనపై నమ్మకంతో వరుసగా రెండు సార్లు విజయాన్ని అందించారని, మరోసారి విజయాన్ని అందించి రాష్ట్ర ముఖ్యమంత్రికి కానుకగా ఇవ్వాలని పిలుపునిచ్చారు. టీడీపీ నాయకులు చేస్తున్న లేనిపోని విమర్శలు తిప్పి కొట్టాలని కోరారు. పార్టీ విజయానికి పని చేసే నాయకులను, కార్యకర్తలను తాము గుర్తు పెట్టుకుని తగు న్యాయం చేస్తామని తెలిపారు. ఎన్నికల సమయంలో ఎక్కడా నిర్లక్ష్య ధోరణి చూపరాదని కోరారు. ప్రతి ఒక్కరూ ఓటర్ల జాబితా సరి చూసుకోవాలని సూచించారు. పార్టీ గెలుపునకు ప్రతి ఓటు కీలకమైందని తెలిపారు. అనంతరం గ్రామ పంచాయతీల వారీగా నాయకులతో సమీక్షించారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యే జీ.వి. శ్రీనాథరెడ్డి, ఎండీసీ డైరెక్టర్ హరీష్‌రెడ్డి, ఎంపీపీలు సతీష్‌రెడ్డి, ఈశ్వరమ్మ, జెడ్పీటీసీలు గజ్జెల శృతి, రత్నశేఖర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్లు వెంకటరమణారెడ్డి, దండు జగన్‌మోహన్‌రెడ్డి, నాయకులు జీ.వి.రాకేష్‌రెడ్డి, కారపాకుల భాస్కర్‌నాయుడు, యల్లయ్య, జయరామచంద్రయ్య, జీనత్‌షఫీ, హుమయూన్, చలపతి, మహిత ఆనంద్, సైపుల్లాఖాన్, వెంకటసిద్ధులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ భవన నిర్మాణాలు వేగవంతం చేయాలి



పనులు పరిశీలిస్తున్న డీఈ భాస్కర్

**పీలేరు రూరల్ :** నియోజకవర్గంలో ప్రభుత్వ భవన నిర్మాణాలు వేగవంతం చేయాలని పంచాయతీరాజ్ డీఈ భాస్కర్ అన్నారు. శనివారం పీలేరు పట్టణంలోని గ్రామ సచివాలయ భవన నిర్మాణాలు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో 74 గ్రామ సచివాలయాలకు గాను 68 నిర్మాణాలు పూర్తి అయినట్లు తెలిపారు. ఆర్‌బీకేలు 65కు గానూ 55 పూర్తి అయినట్లు చెప్పారు. వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లు 34కు గానూ 28 పూర్తి అయినట్లు చెప్పారు. మిగిలినవి త్వరితగతిన పూర్తి చేయాలన్నారు.



## వాలీబాల్ పోటీల్లో కలికిరి జట్టు ప్రతిభ

**కలికిరి :** ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీల్లో భాగంగా పీలేరు నియోజకవర్గ స్థాయిలో వాలీబాల్ మహిళల విభాగంలో మండల పరిధిలోని కలికిరి–2 గ్రామ సచివాలయ జట్టు విజేతగా నిలిచింది. ఈ సందర్భంగా శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో విజేత మహిళ జట్టుకు ఎంపీపీ నూర్జహాన్ చేతుల మీదుగా చాంపియన్‌షిప్ ట్రోఫీ, మెడల్స్ అందజేసి అభినందించారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ పరుశురాం, సీనియర్ అసిస్టెంట్ నాగేంద్ర, మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.